సాక్షి అన్నమయ్య జిల్లా

మంగళవారం । 17 । డిసెంబర్ । 2024



అక్రమ కట్టాలపై కొరడా

రాయచోటి పట్టణ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన అక్రమ కట్టడాల తొలగింపునకు సోమవారం అధికారులు శ్రీకారం చుట్టారు. -8లో



సమస్యల పరిష్కారంలో అలసత్వం తగదు

ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం చేయకూడదని జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు పోలీసులకు సూచించారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.140	రూ.180
రెండోరకం	రూ.90	రూ.110



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 184 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	537	563
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 123.080 కిలోలు

న్యూస్‌రీల్

శ్రీ వీరభద్రస్వామి హుండీ ఆదాయం లెక్కింపు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న భక్తులు, ఆలయ సిబ్బంది

రాయచోటి టౌన్: రాయచోటి శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో హుండీల ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. ఆలయంలోని వినాయకుడు, శ్రీ అఘోరలింగేశ్వరుడు, శ్రీ వీరభద్రస్వామి, శ్రీ భద్రకాళీ అమ్మవారి ఆలయాలకు చెందిన హుండీ ఆదాయాలను లెక్కించారు. 171 రోజులకు సంబంధించి స్వామి వారికి రూ.45,23,541 ఆదాయం వచ్చింది. 47 గ్రాముల బంగారం, 4.3 కిలలో వెండి ఆభరణాలు కూడా వచ్చినట్లు ఆలయ అధికారులు చెప్పారు. ఈ మొత్తాన్ని కెనెరా బ్యాంక్‌లో జమ చేశారు.కార్యక్రమంలో దేవదాయశాఖ ప్రత్యేక అధికారి ఎం. రవికుమార్, ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.


అధ్యాపకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా రాఘవరెడ్డి



రాఘవరెడ్డిని సన్మానిస్తున్న బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆనందరెడ్డి, సిబ్బంది

మదనపల్లె: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకుల సంఘం(జీసీటీఏ ఏపీ) రాష్ట్ర అధ్యక్షుడిగా పట్టణంలోని బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు డాక్టర్.మలిగి రాఘవరెడ్డి ఎన్నికయ్యారు. విజయవాడ ఎస్‌ఆర్‌ఆర్, సీవీఆర్ కళాశాల వేదికగా ఆదివారం జరిగిన 37వ జీసీటీఏ ఏపీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశం అనంతరం జరిగిన కేంద్రస్థాయి ఎన్నికల్లో 201-30 ఓట్ల తేడాతో తన ప్రత్యర్థిపై రాఘవరెడ్డి విజయం సాధించారు. ఈ సందర్భంగా సోమవారం బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకులు రాఘవరెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.జి.ఆనందరెడ్డి, వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్.జి.శ్రీదేవి, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫొటో, వీడియోగ్రఫీలో ఉచిత శిక్షణ



కడప కోటిరెడ్డిసర్కిల్: కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 19 నుంచి ఫొటో, వీడియోగ్రఫీ, సెల్‌ఫోన్ రిపేరింగ్, సర్వీసింగ్, రిఫ్రిజిరేషన్, ఎయిర్ కండీషనింగ్‌లో ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ ఆరిఫ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల రోజుల పాటు ఇచ్చే శిక్షణకు 18–45 ఏళ్ల మధ్య వయసు గల వారు అర్హులని ఆయన పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత యువకులకు ప్రాధాన్యత ఇస్తారని, దూర ప్రాంతాల వారికి ఉచిత వసతి, భోజన సదుపాయాలు కల్పిస్తారన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్లు : 94409 05478, 99856 06866లలో సంప్రదించాలని వివరించారు.

19 నుంచి క్రీడా పోటీలు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక కొర్రపాడు రోడ్డులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 19 నుంచి 21 వరకు కడప రీజనల్ స్థాయి 27వ ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్, గేమ్స్ బాలుర క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జింకా అశోక్‌బాబు తెలిపారు. ఈ క్రీడా పోటీలకు సంబంధించిన పోస్టర్లను సోమవారం కళాశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల నుంచి 384 మంది క్రీడాకారులు పాల్గొంటారన్నారు. వీరికి చెస్, వాలీబాల్, కబడ్డీ, టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్, బాల్ బ్యాడ్మింటన్, 100 మీ, 200 మీ, 400 మీ, 800 మీ, 1500 మీ, 100 మీటర్లు, 4 రిలే, హైజంప్, లాంగ్‌జంప్, బ్రాడ్‌జంప్, ట్రిపుల్ జంప్, డిస్కస్‌త్రో, జావెలిన్‌త్రో తదితర విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పగలు తోడేస్తూ.. రాత్రిళ్లు తోలేస్తూ..

- రెచ్చిపోతున్న ఇసుకాసురులు
- యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా
- తూతూ మంత్రంగా చర్యలు



రామానాయిని చెరువులో ఇసుకను ట్రాక్టర్లలో నింపుతున్న అక్రమార్కులు

గుర్రంకొండ: ఇసుకాసులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. పగలంతా చెరువు పరిసర పొలాల్లో ఇసుకను లోడింగ్ చేసి రాత్రిళ్లు గుట్టుచప్పుడు కాకుండా బయట ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇంత జరుగుతున్నా ఆధికారులు తూతు మంత్రంగా చర్యలు తీసుకుంటున్నారనే విమర్శలున్నాయి.

- గుర్రంకొండ మండలంలోని తరిగొండ, మర్రిపాడు గ్రామాల్లోని రామానాయిని చెరువు, హరిహరాదుల చెరువు అతిపెద్ద ఇరిగేషన్ చెరువులు. వందలాది ఎకరాల్లో ఈరెండు విస్తరించి ఉన్నాయి. చెరువుల్లో ఇసుక నిల్వలు భారీగా ఉండడంతో ఇసుకాసురుల కళ్లు వీటిపై పడ్డాయి. రోజుల తరబడి జేసీబీలతో చెరువుల్లోని ఇసుకను తోడేస్తున్నారు. ఒక జేసీబీ.. నాలుగు నుంచి ఐదు ట్రాక్టర్లను ఏర్పాటు చేసుకొని ఇసుకను తోలేస్తున్నారు. చెరువుల్లో ముందుగా పైన మట్టిని జేసీబీలతో తవ్వకాలు చేపడుతున్నారు. తవ్వేసిన మట్టిన ట్రాక్టర్ల ద్వారా తీసుకెళ్లి ఇటుక బట్టీలకు విక్రయిస్తున్నారు.తరువాత టన్నుల కొద్దీ ఇసుక నిల్వలు బయటపడుతున్నాయి. పట్టపగలే జేసీబీలతో ఇసుకను ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా తోలేస్తున్నారు.
- ఇసుక తరలింపులో ఇసుకాసురులు కొత్త మార్గానికి శ్రీకారం చుట్టారు. ఎన్నడూ లేని విధంగా ఇసుకను భారీ ఎత్తున డంపింగ్ చేస్తున్నారు. పగలంతా చెరువుల్లోని ఇసుకను ట్రాక్టర్ల ద్వారా తీసుకొచ్చి చెరువు పరిసరాల్లోని పొలాల వద్ద డంపింగ్ చేస్తున్నారు. రాత్రిళ్లు గుట్టుచప్పుడు కాకుండా వాహనాల ద్వారా బయట ప్రాంతాలకు తరలించేస్తున్నారు. మండలంలోని రామానాయిని చెరువుకు సమీపంలోని రుద్రావాండ్లపల్లె, పిల్లగోవులపల్లె, రేగడపల్లె, కొత్తపల్లె, మర్రిపాడు పరిసర గ్రామాల్లో ఇసుక డంప్‌లు ఏర్పాటు చేస్తున్నారు. పదిలోడ్ల నుంచి పదిహేను లోడ్ల వరకు ఇసుక డంపింగ్ చేస్తున్నారు. ఎవరికీ అనుమానం రాకుండా అక్కడక్కడా ఇసుక డంపిగ్‌లు ఉంచి రాత్రిళ్లు జేసీబీల సాయంతో టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తున్నారు.

పక్క మండలాలకు తరులుత్నున ఇసుక

మండలంలోని మర్రిపాడు, తరిగొండ, అమిలేపల్లె, శెట్టివారిపల్లె, బోడిగుట్ట సమీప చెరువుల్లో ఇసుక దోపిడీ యథేచ్ఛగా సాగుతోంది. కొంతమంది వ్యక్తులు చెరువులను ఆక్రమించేశారు. వీటిలో చేరిన టన్నుల కొద్దీ ఇసుకను బహిరంగంగా టిప్పర్లు,ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. పక్కనే ఉన్న వాల్మీకీపురం, కురుబలకోట, పెద్దమండ్యం మండలాలకు ఇసుకను తరలించి సొమ్ము చేసుకొంటున్నారు. ఒక ట్రాక్టర్ ఇసుకను బయట ప్రాంతాల్లో రూ. 3వేలు నుంచి రూ.3300వరకు విక్రయిస్తున్నారు. స్థానికంగా ఉన్న కొంతమంది నేతలు ఇళ్ల నిర్మాణాల నిమిత్తం ఇసుకను చెప్పుకొంటూ రాత్రిళ్లు బయట ప్రాంతాలకు తరలిస్తున్నారు.

ఇంటినిర్మాణాలు, ప్రభుత్వపనుల సాకుతో..

ఇంటినిర్మాణాలు, ప్రభుత్వం ఇటీవల మంజూరు చేసిన అభివృద్ధి పనుల నిర్మాణాల కోసం అనే సాకుతో ఇసుకాసురులు ఇసుకను విక్రయిస్తున్నారు. మండలంలో సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. వీటిని సాకుగా చూపించి రోజుల తరబడి ఇసుకను చెరువుల్లో అక్రంగా తోడేస్తూ కొంతమంది లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకొంటున్నారు. గృహ అవసరాల కోసం ఇసుకను ట్రాక్టర్ల ద్వారా తరలించేందకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. అయితే జేసీబీలతో తోడేయమని ఎక్కడా అనుమతి ఇవ్వలేదు. అయినా ఇవేవీ తమకు పట్టవంటూ కొంతమంది నేతలు ఇసును జేసీబీలతో రాత్రిబంవళ్లు తోడేస్తున్నారు. ఇసుక విషయమై ఆధికార పార్టీకి చెందిన ఓ వర్గం నేతలు ఇటీవల రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసిన సంఘటనలు చోటుచేసుకొన్నాయి. స్వయంగా అధికార పార్టీ నేతలే అధికారులకు ఫిర్యాదు చేసే స్థాయికి వచ్చారంటే ఏ స్థాయిలో ఇసుక అక్రమరవాణా జరుగుతుందో తేటతెల్లమవుతోంది.

▶▶ చోద్యం చూస్తున్న అధికారులు



రుద్రావాండ్లపల్లె వద్ద ఇసుకాసురులు ఏర్పాటు చేసిన ఇసుక డంప్

ఇసుక అక్రమరవాణాను అరికట్టి చర్యలు తీసుకోవాల్సిన అధికారులు చోద్యం చూస్తూ కాలం వెళ్లదీస్తున్నారనే విమర్శలున్నాయి. గతంలో కొద్దిరోజుల పాటు స్థానిక రెవెన్యూ అధికారులు చెరువుల వద్ద హడావిడి చేసి ఇసుక అక్రమ రవాణాను అరికట్టామంటూ ప్రచారం చేసుకున్నారు. పోలీసులు రెండు రోజుల పాటు చెరువుల వద్ద కాపాలాగా ఉన్నారు. అయినా ఫలితం లేదు. అక్రమ రవాణా ఆగడం లేదు. దీంతో అధికారులు చెరువులవైపు వెళ్లడం మానేశారని రైతులు, గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం



మర్రిపాడు, తరిగొండ గ్రామాల్లోని చెరువుల్లో ఇసుక అక్రమ రవాణాపై చర్యలు తీసుకుంటాం. ఈ విషయమంపై అప్రమత్తంగా ఉండాలని స్థానిక వీఆర్వో, వీఆర్‌ఏలను ఆదేశించాం. తమ సిబ్బందిని ఎక్కువ సమయం చెరువుల వద్దే ఉండే విధంగా చర్యలు చేపడతాం. నిబంధనలను ఉల్లంఘించి ఇసుక అక్రమంగా తరలిస్తే వాహనాలు సీజ్ చేసి కేసులు నమోదు చేయిస్తాం.

– శ్రీనివాసులు, తహసీల్దార్, గుర్రంకొండ

బందోబస్తు ఏర్పాటు చేస్తాం



రామానాయిని చెరువు, హరిహరాదుల చెరువుల వద్ద గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తాం. గతంలో కొద్దిరోజుల పాటు చెరువుల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశాం. ఇకమీదట ఇసుక అక్రమంగా తరలించే వాహనాలను సీజ్ చేసి చట్టపరమైన చర్యలు చేపడతాం.

–మధురామచంద్రుడు, ఎస్‌ఐ, గుర్రంకొండ

'గుడ్ గవర్నెన్స్ వీక్'ను విజయవంతం చేయండి

- డీఆర్వో విశ్వేశ్వర్ నాయుడు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న డీఆర్వో, జిల్లా అధికారులు

కడప సెవెన్‌రోడ్స్: 'ప్రశాసన్ గావోన్ కి ఓర్–2024' కార్యక్రమంలో భాగంగా దేశవ్యాప్తంగా ఈ నెల 19 నుంచి 24 వరకు జరిగే గుడ్ గవర్నెన్స్ వీక్ (జీజీడబ్ల్యూ) క్యాంపెయిన్ కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేయాలని డీఆర్వో విశ్వేశ్వర్ నాయుడు అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం ఢిల్లీ నుంచి భారత ప్రభుత్వ పరిపాలనా సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల విభాగం (డీఏర్‌పీజీ) కార్యాలయం నుంచి గుడ్ గవర్నెన్స్ వీక్ (జీజీడబ్ల్యూ) క్యాంపెయిన్ ప్రచార ప్రణాళికపై.. వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆదేశాల మేరకు స్థానిక కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి డీఆర్వోతోపాటు జిల్లా పరిషత్ సీఈవో ఓబులమ్మ, ఇన్‌చార్జి సీపీవో హజరతయ్య, డీఐఓ విజయ్‌కుమార్, డీఐపీఆర్వో వేణుగోపాల్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం డీఆర్వో మాట్లాడుతూ 'ప్రశాసన్ గావోన్ కి ఓర్' – 2024 కార్యక్రమం నిర్వహణకు జిల్లాలో విస్తృతమైన ప్రచారం చేసి, ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. భారత ప్రభుత్వ పరిపాలనా సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల విభాగం ఆధ్వర్యంలో సాగుతున్న ఈ ప్రచార కార్యక్రమంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి, పబ్లిక్ సర్వీస్ డెలివరీని మెరుగుపరచడానికి జిల్లా యంత్రాంగం చేపడుతున్న చర్యలపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని వివరించారు.

సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్



ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ శ్రీధర్

రాయచోటి: ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తోపాటు డీఆర్‌ఓ మధుసూదన్‌రావు, కలెక్టరేట్ ఎస్‌డీసీ రామసుబ్బయ్యలు పాల్గొన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. అర్జీదారుల నుంచి అందిన సమస్యలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ తెలిపారు. ప్రజలు ఇచ్చిన అర్జీలోని అంశంపై దృష్టి పెట్టాలన్నారు. పెండింగ్ దరఖాస్తులు రీ–ఓపెనింగ్ లేకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కరించాలని సూచించారు. అలాగే రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు.

కోర్టు కేసులకు ప్రాధాన్యత ఇవ్వాలి

ప్రభుత్వ శాఖలలో కోర్టు కేసులకు సంబంధించి సకాలంలో కౌంటర్ ఫైల్ చేయాలని లేని పక్షంలో సంబంధిత అధికారులపై అవసరమైన క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని, ఇటీవల హైకోర్టు ఆదేశించిందని కలెక్టర్ పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి కోర్టు కేసులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కనీసం 15 రోజులు ముందుగానే కౌంటర్‌ను సిద్ధ చేయాలని, నిర్ణీత కాల వ్యవధిలో కౌంటర్ ఫైల్ చేయని వారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని జిల్లా, మండలస్థాయి అధికారులను కలెక్టర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కోడిగుడ్డు అధరహో!



అమ్మకానికి సిద్ధంగా ఉన్న కోడిగుడ్లు

రాయచోటి: కోడిగుడ్డు ధరలు మాత్రం వేడి చేయకుండానే ఉడికిపోతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా రిటైల్ మార్కెట్‌లో ఒక్కో గుడ్డు రూ.7.50లకు విక్రయిస్తున్నారు. కూరగాయలతో పాటు కోడ్డి గుడ్డు ధరలు కూడా కొండెక్కడంతో కొనుగోలుదారుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. తెలుగు రాష్ట్రాల్లో కోళ్ల పెంపకం అధికం కావడంతో పాటు కోడిగుడ్ల రేటు కూడా సామాన్యులకు అందుబాటులో ఉండేది. అయితే పక్క రాష్ట్రాల్లో అక్కడి ప్రభుత్వాలు సబ్సిడీలు ఇవ్వడంతో పౌల్ట్రీ ఫామ్స్ పెరిగిపోయాయి. ఫలితంగా ఏపీ నుంచి ఎగుమతులు తగ్గిపోయినట్లు సమాచారం. కోడిగుడ్ల ఉత్పత్తి తగ్గిపోయింది. దీంతో చాలా చోట్ల మన రాష్ట్రంలో పౌల్ట్రీ ఫామ్స్ మూసివేశారు.ఫలితంగా కోడిగుడ్డు రేటు పెరిగిపోయింది. పెరిగిన భారం వినియోగదారుడి నెత్తినపడటంతో గుడ్డు రేటుకు రెక్కలు వచ్చాయి.

ఉత్పత్తికి పెరిగిన ఖర్చు: ఒక గుడ్డు ఉత్పత్తికి పౌల్ట్రీలలోనే రూ.5 వరకు ఖర్చవుతోందని వ్యాపారులు చెబుతున్నారు. చిత్తూరు, తిరుపతి, హైదరాబాద్ ప్రాంతాల నుంచి మన ప్రాంతాలకు గుడ్ల సరఫరా జరుగుతుంటుంది. అక్కడ నుంచి ఇక్కడికి చేరుకొని వినియోగదారునికి అందడానికి రూ.7.50 పడుతోందని చెబుతున్నారు. ఆగస్టులో గుడ్డు రేటు రూ.5.70గా ఉంటే ప్రస్తుతం అది **రూ.7.50కి చేరింది. ఈజీగా** చేసుకోవడంతో పాటు బలవర్ధకమైన ఆహారం కావడంతో చాలా మంది గుడ్డుని ప్రిఫర్ చేస్తారు. బేకరీ ఫుడ్స్‌లో కూడా కోడిగుడ్ల వినియోగం ఎక్కువగా ఉంటుంది. దాంతో వాటి రేట్లు కూడా పెరిగిపోతున్నాయని కొనుగోలుదారులు వాపోతున్నారు.

విద్యార్థులకు కష్టమే

పెరిగిన ధరలతో విద్యార్థులకు గుడ్డు అందుతుందన్న ఆశలు కనిపించడం లేదు. అనుకూలమైన ధరలు ఉన్న సమయంలోనే గోలీల సైజులో ఉన్న గుడ్లనైనా అందించేవారు. నేడు పెరిగిన ధరల కారణంగా ఆ చిన్న గుడ్లు కూడా విద్యార్థులకు అందకుండా పోతున్నాయన్న భయం నెలకొంది.

సంవత్సరాల వారీగా కోడిగుడ్డు ధరలు(రూ.లలో)

2020	5.95
2021	5.26
2022	5.39
2023	6.20
2024	7.50



అతివలలో అనాసక్తి!

- స్వయం సహాయక సభ్యులతోపాటు ఆసక్తిగల వారికి యూనిట్లు
- ముందుకు రాని మహిళలు



జిల్లాలో ఎస్‌హెచ్‌జీ గ్రూపులు: **30,685**

మొత్తం సభ్యులు: **300671** మంది


ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు లక్ష్యం: **150**

సాక్షి రాయచోటి: కేంద్ర ప్రభుత్వం చిన్నపాటి పరిశ్రమలు...ఆహార ఉత్పత్తి కేంద్రాలవైపు అడుగులు వేస్తున్నా మహిళల నుంచి ఆసక్తి కనబడటం లేదు. ప్రధానంగా స్వయం సహాయక సంఘ గ్రూపులైతే 10 మందికి ఉపాధి కల్పించడమే కాకుండా ప్రజలకు కూడా నాణ్యమైన ఉత్పత్తులను అందిస్తారన్న సంకల్పంతో ప్రధానమంత్రి ఫార్మేషన్ ఆఫ్ మైక్రో ఎంటర్‌ప్రైజెస్ (పీఎంఎఫ్‌ఎంఈ) కింద సబ్సిడీ రుణాలు అందిస్తున్నారు. అయితే గ్రామీణ స్థాయిలో ప్రజలే కాకుండా అతివలు కూడా ఆసక్తి చూపడం లేదు. ఆహార పరిశ్రమలకు సంబంధించి మార్కెటింగ్‌తోపాటు ఇతర కొనుగోలు సమస్యలు కూడా ఏర్పడతాయన్న ఆలోచనే దీనికి కారణం. ఇప్పటికే సెర్ప్ నుంచి ఆదేశాల మేరకు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు ఆసక్తిగల వారు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పేందుకు ముందుకు వస్తే సబ్సిడీ రుణాల ద్వారా సహకారం అందిస్తామని తెలియజేశారు. అన్నమయ్య జిల్లాలో సుమారు 30,685 ఎస్‌హెచ్‌జీ గ్రూపులు ఉండగా, 300671 మంది సభ్యులు ఉన్నారు. ఇప్పటికే డీఆర్‌డీఏ ద్వారా ఆహార ఉత్పత్తులకు సంబంధించిన పరిశ్రమలు నెలకొల్పాలన్న ఆసక్తి ఉన్న వారు ముందుకు వస్తే అందుకు సబ్సిడీతో రుణాలు ఇప్పించేందుకు సంస్థ ముందుకు వస్తుందని అధికారులకు వివరిస్తున్నారు. అతివలు మహిళా సాధికారత సాధించి, పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలన్న ఆలోచన ఉన్నప్పటికీ చాలామంది ముందుకు రావడం లేదు. జిల్లాకు సంబంధించి సుమారు 150 ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు లక్ష్యంగా నిర్ణయించారు. అయితే చాలామంది మహిళల్లో రుణాలతోపాటు పరిశ్రమల ఏర్పాటుతో అనేక సమస్యలు ఉత్పన్నమవుతాయన్న ఆందోళన వెంటాడుతోంది.

స్వయం ఉపాధికి ప్రత్యేక శిక్షణ

అన్నమయ్య జిల్లాలోని కలికిరిలో ఉన్న కృషి విజ్ఞాన కేంద్రంలో మహిళలకు శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటికే సుమారు 1250 మందికి పైగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని స్వయం ఉపాధి కోసం శిక్షణ ఇచ్చారు. ఆసక్తిగల వారిని ప్రత్యేకంగా శిక్షణతో తీర్చిదిద్దుతున్నారు. ఉపాధి బాట పట్టాలనుకున్న వారికి పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు అవసరమైన విజ్ఞానాన్ని అందిస్తున్నారు. శిక్షణ ద్వారా కూడా తెలుసుకుని పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు అవకాశాలను అందిపుచ్చుకోవచ్చు.

▶▶ చిరుధాన్యాల యూనిట్లతో ప్రయోజనం



ప్రస్తుతం మారుతున్న కాలానికి అనుగుణంగా చిరుధాన్యాలకు ప్రాధాన్యత పెరిగింది. రాగులు, జొన్నలు, కొర్రలు, సొద్దలు, అరికెలు, సామెలు తదితరాలతో ఆహార ఉత్పత్తి పరిశ్రమలకు డీఆర్‌డీఏ ప్రాధాన్యనిస్తోంది. అయితే ఈ చిరుధాన్యాల ఉత్పత్తులు తినడం ద్వారా మనిషికి పౌష్టికాహారంగా ఉపయోగపడడంతోపాటు చాలా ప్రయోజనాలుఉన్నాయి. ఈ నేపథ్యంలో డ్వాక్రా మహిళల ద్వారా అటువైపు ప్రోత్సహిస్తే వారు ఆర్థికంగా ఎదగడానికి అవకాశం ఉంటుందని గ్రామీణాభివృద్ధిశాఖ భావిస్తోంది.

డీలర్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

సబ్ కలెక్టర్ మేఘస్వరూప్



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె: మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఖాళీగా ఉన్న రేషన్‌షాపులకు డీలర్లను భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ తెలిపారు. సోమవారం సబ్ కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో రేషన్ డీలర్ల భర్తీ ప్రక్రియకు సంబంధించిన రివైజ్డ్ నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ మాట్లాడుతూ...మదనపల్లె డివిజన్‌లో 445 రేషన్‌షాపులు ఉన్నాయన్నారు. వీటిలో 74 షాపులు డీలర్లు లేక ఖాళీగా ఉన్నాయన్నారు. అలాగే...1,000 కార్డులకు పైబడి 1,500 కార్డుల వరకు కలిగి ఉన్న షాపులను విభజించేందుకు ప్రతిపాదనలు తయారుచేస్తే 45 షాపులు ఖాళీగా ఉన్నాయన్నారు. దీంతో మొత్తం 119 షాపులకు డీలర్ల నియామకానికి అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. రెవెన్యూ డివిజన్‌లోని అన్ని తహసీల్దార్ కార్యాలయాల్లో ఖాళీలకు సంబంధించిన వివరాలు నోటీసుబోర్డులో ప్రదర్శిస్తామని తెలిపారు. రేషన్‌షాపులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఇంటర్మీడియట్ విద్యార్హత కలిగి ఉండి 18–40 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలన్నారు. ఖాళీగా ఉన్న రేషన్‌షాపు ఉన్నటువంటి వార్డులో కానీ, గ్రామంలో కానీ నివాసం ఉండాలన్నారు. డిసెంబర్ 21వతేదీ సాయంత్రం 5 గంటలలోపు పూర్తిచేసిన దరఖాస్తులను సంబంధిత తహసీల్దార్ కార్యాలయాల్లో అందజేయాలన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులకు డిసెంబర్ 28వతేదీ ఉదయం 10 గంటలకు 80 మార్కులకు రాతపరీక్ష ఉంటుందని, అందులో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు 1:15 నిష్పత్తిలో డిసెంబర్ 30, 31 తేదీల్లో 20 మార్కులకు వినియోగదారుల సంబంధాలు, నిర్వహణ సామర్థ్యము, ఆర్థిక స్తోమత తదితర అంశాలపై ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేస్తామన్నారు.

మదనపల్లె మండలం, అర్బన్ ఖాళీల వివరాలు

అంకిశెట్టిపల్లె(ఓసీ–మహిళ), మందబండ(ఓసీ–మహిళ), వలసపల్లె(ఓసీ), కాకరకాయలపల్లె(ఓసీ), డ్రైవర్స్‌కాలనీ, పుంగనూరురోడ్డు, గంగమ్మగుడి(బీసీ–ఏ), పప్పిరెడ్డిగారిపల్లె(బీసీ–బీ మహిళ), సైదాపేట(ఓసీ), గుండ్లూరువీధి(ఓసీ), సిపాయివీధి(ఓసీ), గొల్లపల్లె క్రాస్(ఓసీ), ఇందిరానగర్(బీసీ–ఈ)

ఏడుగురు కార్పొరేటర్లు సస్పెన్షన్

కడప కార్పొరేషన్: వైఎస్సార్‌జిల్లా కడప నగరపాలక సంస్థలో ఏడుగురు కార్పొరేటర్లు, నలుగురు పార్టీ నాయకులను సస్పెండ్ చేసినట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2వ డివిజన్ కార్పొరేటర్ ఎం.సుబ్బారెడ్డి, 3వ డివిజన్ కార్పొరేటర్ ఎం.మానస, 6వ డివిజన్ కార్పొరేటర్ నాగేంద్రప్రసాద్, 8వ డివిజన్ కార్పొరేటర్ ఎ.లక్ష్మీదేవి, 32వ డివిజన్ కార్పొరేటర్ ఎస్‌బీ జఫ్రుల్లా, 42వ డివిజన్ కార్పొరేటర్ సి.స్వప్న, 50 డివిజన్ కార్పొరేటర్ కె.అరుణ ప్రభ, పార్టీ నాయకులు ఎం.సుదర్శన్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, చల్లా రాజశేఖర్, కె.రాజశేఖర్‌రెడ్డిలను పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న దృష్ట్యా సస్పెండ్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. త్వరలోనే ఆయా డివిజన్‌లకు కొత్త ఇన్‌చార్జిలను నియమిస్తామని వివరించారు.

క్లుప్తంగా

ఇరు వర్గాలపై బైండోవర్ కేసు

లక్కిరెడ్డిపల్లి : తమ ఇంటిపై దౌర్జన్యం చేసి మహిళలను బెదిరించారని మండలంలోని అప్పకొండయ్యగారిపల్లి పంచాయతీ ఉత్తర మెట్ట ఎస్సీ కాలనీకి చెందిన రామచంద్రయ్య కుటుంబ సభ్యులపై కూటమి నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఇరు వర్గాల వారిపై బైండోవర్ కేసు నమోదు చేసినట్లు లక్కిరెడ్డిపల్లి ఎస్ఐ రవీంద్ర బాబు తెలిపారు. గ్రామాలలో చిన్నచిన్న గొడవలు పెద్దమనుషుల సమక్షంలో పరిష్కారం చేసుకోవాలని లేని పక్షంలో కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

నలుగురిపై కేసు నమోదు

సిద్దవటం : మండలంలోని టక్కోలు గ్రామం అరుంధతి వాడలో ఆదివారం రాత్రి జరిగిన ఘర్షణలో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ సుబ్బరామచంద్రరాజు తెలిపారు. ఆదివారం రాత్రి టక్కోలు అరుంధతీవాడలో బాలమునెయ్య, జేమ్స్‌బాబు కుటుంబాల మధ్య ఉన్న పాత కక్షల నేపథ్యంలో బాలచైతన్య అనే వ్యక్తి ఈశ్వరయ్యను తిట్టాడన్నారు. తమ తమ్ముడిని ఎందుకు తిడుతున్నావని ఈశ్వరయ్య అన్న మల్లికార్జున ప్రశ్నించడంతో అతనిపై కూడా తిరగబడ్డాడన్నారు. దీంతో ఇరు కుటుంబాల వారు ఘర్షణ పడ్డారన్నారు. ఈ ఘర్షణలో కర్రలతో దాడి చేయడంతో మల్లికార్జున తలకు తీవ్ర గాయాలు కాగా అమ్మ ఓబులమ్మకు, తండ్రి బాలమునెయ్య, తమ్ముడు ఈశ్వరయ్యలకు స్వల్ప గాయాలయ్యాయన్నారు. గాయపడిన వారిని కడప రిమ్స్‌కు తరలించామన్నారు. మల్లికార్జున తలకు తీవ్ర గాయం కావడంతో అతన్ని కర్నూలుకు సిఫార్సు చేశారన్నారు. నేలటూరు ఈశ్వరయ్య ఫిర్యాదు మేరకు బాలచైతన్య, వంశీకిరణ్, జయరాజు, జేమ్స్‌బాబులపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

రాయచోటిలో అక్రమ కట్టడాలపై కొరడా

బఫర్ జోన్‌లోని అపార్ట్‌మెంట్ తొలగింపు పనులు చేపట్టిన అధికారులు

రాయచోటి అర్బన్ : పట్టణ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన అక్రమ కట్టడాల తొలగింపునకు సోమవారం అధికారులు శ్రీకారం చుట్టారు. మాండవ్యనది బఫర్‌జోన్‌లో అక్రమంగా నిర్మించిన ఐదు అంతస్థుల అపార్ట్‌మెంట్‌లో కొంత భాగం తొలగింపు పనులను మున్సిపల్ అధికారులు మొదలెట్టారు. మాండవ్యనది ఒడ్డున బఫర్, రివర్ జోన్‌లో అక్రమంగా అపార్ట్‌మెంట్ల నిర్మాణం చేపడుతున్నట్లు 6 నెలల క్రితమే అధికారులకు ఫిర్యాదులు అందాయి. అప్పట్లో మున్సిపల్ అధికారులు సదరు భవనాన్ని నిర్మిస్తున్న వారికి నోటీసులు జారీ చేశారు. స్పందించిన భవన నిర్మాణదారుడు బఫర్ జోన్‌లోని కట్టడాన్ని కొంతమేర తొలగించారు. ఈలోపే ఎన్నికల కోడ్ రావడంతో సీన్ తారుమారైంది. ఎన్నికల సమయంలో బఫర్ జోన్‌లోని నిర్మాణాన్ని తొలగించకపోగా మరింతగా నిర్మాణం పనులు చేపట్టారు. బఫర్ జోన్‌లో కట్టడాలు జోరుగా సాగుతున్నాయని ఇటీవల జరిగిన మున్సిపల్ సమావేశంలో మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు ఆరోపించారు. అక్రమ నిర్మాణాల తొలగింపులో మీనమేషాలు లెక్కిస్తున్నారంటూ టౌన్ ప్లానింగ్ అధికారులపై మండిపడ్డారు. సమావేశంలోనే ఉన్న రవాణా శాఖ మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి స్పందించి అక్రమ కట్టడాల తొలగింపును వెంటనే చేపట్టాలంటూ అధికారులను ఆదేశించారు. దీంతో కొద్దిరోజుల క్రితం రెవెన్యూ, ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ, మున్సిపల్ తదితర శాఖల అధికారులు మాండవ్యనది ఆక్రమణలపై సమష్టిగా సర్వే చేశారు. సర్వే నంబర్ 280లో బఫర్‌జోన్‌లో అపార్ట్‌మెంట్ల నిర్మాణం కొంతమేర నిబంధనలకు విరుద్ధంగా సాగుతోందంటూ మరోసారి నిర్ధారించారు. రివర్‌జోన్‌ను కూడా ఆక్రమించి మాండవ్యనదిని చదును చేసినట్లు తేల్చారు. వెంటనే పోలీసు బందోబస్తు నడుమ మున్సిపల్ కమిషనర్ వాసుబాబు ఆధ్వర్యంలో మున్సిపల్ అధికారులు, కూలీలు అక్రమకట్టడంగా గుర్తించిన భవనం నిర్మాణం పనుల తొలగింపును చేపట్టారు. కాగా అక్రమ కట్టడం తొలగింపు పనులను సోమవారం మధ్యాహ్నం మంత్రి రాంప్రసాద్‌రెడ్డి పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన కట్టడాలన్నింటిని వెంటనే తొలగించాలని, ఎవరికీ భయపడాల్సిన పనిలేదని అధికారులను ఆదేశించారు. కాగా అక్రమ కట్టడాల తొలగింపు అంశంపై మున్సిపల్ కమిషనర్ వాసుబాబు విలేకరులతో మాట్లాడుతూ అపార్ట్‌మెంట్ నిర్మాణదారుడు ఎలాంటి అనుమతులు లేకుండానే భవన నిర్మాణం చేపడుతున్నారన్నారు. అక్రమంగా చేపట్టిన నిర్మాణం పనులను తొలగిస్తున్నట్లు తెలిపారు. ఇవేకాకుండా నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనాలు, ఆక్రమణలను కూడా తొలగిస్తామని చెప్పారు. కార్యక్రమంలో పలువురు పట్టణ ప్రణాళికా విభాగం కార్యదర్శులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.


అపార్ట్‌మెంట్ పిల్లర్లను తొలగిస్తున్న కూలీలు


బఫర్ జోన్‌లో నిర్మించిన అపార్ట్‌మెంట్ భవనాలు

అక్రమ కట్టడాలను సహించేది లేదు

రాష్ట్ర మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటి అర్బన్ : రాయచోటి పట్టణంలో అక్రమ కట్టడాలను నిర్మిస్తే సహించేది లేదని రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖమంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. సోమవారం ఎగువ అబ్బవరం దళితవాడలో అక్రమకట్టడాలపై విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాయచోటిలో గతంలో భూ ఆక్రమణలు, అక్రమ కట్టడాలు అధికంగా జరిగాయన్నారు. కూటమి ప్రభుత్వంలో పార్టీలకతీతంగా ఆక్రమణలను తొలగించి పేదలకు న్యాయం చేస్తామని చెప్పారు. కొంతమంది ప్రభుత్వానికి నష్టం కలిగించే విధంగా అప్రూవల్ లేకుండా ఆరు అంతస్తుల అపార్టుమెంట్లు కడుతున్నారన్నారు. అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించామన్నారు. నదీ పరివాహక ప్రాంతాల్లో కట్టడాలు నిర్మించి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడటం మంచిది కాదన్నారు. అనంతరం ఆయన నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న అపార్ట్‌మెంట్లను మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించి తగు సూచనలు చేశారు.


అపార్ట్‌మెంట్ నిర్మాణాన్ని అధికారులతో కలిసి పరిశీలిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

టీడీపీ యువ నాయకుడు ఆకస్మిక మృతి


మృతి చెందిన అశోక్ కుమార్

కురబలకోట : మండల టీడీపీ నాయకుడు కొండతూర్పు ప్రాంతంలోని శిద్దారెడ్డిగారిపల్లెకు చెందిన అశోక్‌కుమార్ (30) సోమవారం ఉదయం ఆకస్మికంగా మృతి చెందాడు. ఇతను ఇంటి వద్ద ఉండగా అస్వస్థత స్థితిలో కడుపు నొప్పిగా ఉంది..మజ్జిగ కావాలని తల్లి రెడ్డెమ్మను అడిగాడు. ఆమె ఇచ్చిన కొంత సేపటికే అపస్మారక స్థితికి చేరుకున్నాడు. తల్లి ఇరుగు పొరుగును పిలిచి విషయం చెప్పగా వారు హుటాహుటిన మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఇతను గతంలో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో కనసానివారిపల్లె సర్పంచ్ అభ్యర్థిగా గట్టి పోటీ ఇచ్చి ఓడిపోయాడు. నాలుగేళ్ల క్రితం భార్య నుంచి విడాకులు తీసుకున్నాడు. దీనికి తోడు ఏడాది క్రితం రోడ్డు ప్రమాదంలో కాలు, చెయ్యి దెబ్బతింది. ఇటీవల ఇతనికి రావాల్సిన సీఎం రిలీఫ్ ఫండ్ కోసం సీఎం చంద్రబాబును కూడా కలిశాడు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా ఉండేవాడు. ఈ నేపథ్యంలో ఇతను ఆకస్మికంగా మృతి చెందడానికి కారణం ఏమిటన్నది అంతుబట్టడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు. పురుగుల మందు తాగాడా.. లేదా కారణం ఏమిటన్నది తెలియాల్సి ఉంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మైనింగ్ మాఫియాపై చర్యలు తీసుకోవాలి

రాయచోటి అర్బన్/కేవీపల్లి : జిల్లాలోని కె.వి.పల్లె మండలం అడవిపల్లె ప్రాజెక్టు కొండలలో అక్రమంగా జరుగుతున్న మైనింగ్‌పై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కమిటీ సభ్యులు సాంబశివ, టీఎల్ వెంకటేష్, ఎస్.శ్రీనివాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అడవిపల్లె కొండల్లో సాగుతున్న మైనింగ్ మాఫియా ఆగడాలను అరికట్టాలని సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ కేవీపల్లె చుట్టుపక్కల మండలాల రైతాంగానికి సాగునీరందించేందుకు ప్రభుత్వం రూ.2వేల కోట్లు ఖర్చు చేసి అడవిపల్లె వద్ద ప్రాజెక్టును నిర్మిస్తోందన్నారు. ఇక్కడ కొందరు తమిళనాడుకు చెందిన కూలీలతో మైనింగ్ చేస్తుండడంతో కొండలు కరిగిపోయి భవిష్యత్తులో ప్రాజెక్టు కట్ట తెగిపోయే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి, నాయకులు అంజనప్ప, రామసుబ్బమ్మ, రామచంద్ర పాల్గొన్నారు.


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

జోయా లుక్కాస్ జ్యువెలరీ షోరూం ప్రారంభం

కడప కల్చరల్ : ప్రముఖ బంగారు, వెండి, వజ్రాభరణాల షోరూం జోయా లుక్కాస్‌ను అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలో ఏర్పాటు చేశారు. ప్రపంచ వ్యాప్తంగా పేరున్న ఈ సంస్థ షోరూంను సోమవారం మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సతీమణి మండిపల్లి హరిత ప్రారంభించి నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. అంతకుముందు షోరూం నిర్వాహకులు ఆమెకు ఘనంగా స్వాగతం పలికి బొకే అందజేశారు. ఈ సందర్భంగా షోరూంలో ప్రత్యేక నగల ఎగ్జిబిషన్‌ను మూడు రోజులపాటు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు, బ్రాంచ్ ఇన్‌చార్జి ప్రీతీష్ జోసెఫ్ తెలిపారు. షోరూంను ప్రారంభించినందుకు ధన్యవాదాలు తెలిపారు.


షోరూం ప్రారంభం సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి సతీమణి హరిత

పీలేరు ఈఓ గురుమోహన్ అవినీతిపై విచారణ

పీలేరు : పీలేరు ఈఓగా పని చేస్తున్న గురుమోహన్ అవినీతిపై వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు మండలం గోపవరం గ్రామ పంచాయతీలో అధికారులు విచారణ చేపట్టారు. వివరాలిలా ఉన్నాయి. పీలేరు ఈవో గురుమోహన్ 2019 - 2022 మధ్యకాలంలో గోపవరం గ్రామ పంచాయతీలో కార్యదర్శిగా పని చేశారు. ఆ సమయంలో ఇళ్ల నిర్మాణాలకు, లేఅవుట్లకు పంచాయతీ అప్రూవల్‌కు సంబంధించి అనేక అవకతవకలకు పాల్పడినట్లు, నకిలీ బిల్లులు సృష్టించినట్లు, గ్రామ పంచాయతీకి సంబంధించి రూ. 5 కోట్ల నుంచి రూ. 7 కోట్ల వరకు నష్టం చేకూర్చినట్లు గోపవరం పంచాయతీ విరాట్‌నగర్ కాలనీకి చెందిన మార్తల వెంకటసుబ్బారెడ్డి ఈ ఏడాది అక్టోబర్ 18న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తోపాటు రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఆదేశాలు అందుకున్న అధికారులు విచారణ ప్రారంభించారు. జెడ్పీ సీఈఓ ఆదేశాలతో డీఎల్‌పీఓ తిమ్మక్క, గోపవరం పంచాయతీ కార్యాలయంలో విచారణ చేపట్టారు. పంచాయతీ కార్యాలయంలో అవినీతితోపాటు గతంలో ఓ మహిళను వేధించినట్లు ఇతనిపై ఆరోపణలు ఉన్నాయి. బాధ్యతలు చేపట్టిన అనతికాలంలోనే పీలేరులోనూ గురుమోహన్ పలు అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్నారు. ఈ ఏడాది సెప్టెంబర్ 24న పీలేరు గ్రామ పంచాయతీలో అప్రూవల్ కోసం రూ. లక్ష లంచం అడగడంతో బాధితుడు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. అధికారులు సమగ్ర విచారణ జరిపి గురుమోహన్‌పై తగు చర్యలు తీసుకోవాలని పలువురు బాధితులు కోరుతున్నారు.


: విచారణ జరుపుతున్న అధికారులు

ఆర్‌ఓ వాటర్ ప్లాంట్‌ను ధ్వంసం చేసిన వారిపై కేసు నమోదు

సిద్దవటం : మండల కేంద్రమైన సిద్దవటంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్మాణంలో ఉన్న ఆర్‌ఓ వాటర్ ప్లాంట్ భవనం సన్‌షేడ్‌ను ధ్వంసం చేసిన ఘటనలో 17 మందిపై సిద్దవటం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఒంటిమిట్ట సీఐ టి.బాబు తెలిపారు. సిద్దవటంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు దాదాపు రూ. 6లక్షల నిధులతో ఆర్‌ఓ వాటర్ ప్లాంట్ మంజూరు కాగా జిల్లా కలెక్టర్ ఆదేశాలతో కాంట్రాక్టర్ సుధాకర్ యాదవ్ నిర్మాణ పనులు చేపట్టారన్నారు. అయితే తన అనుమతి లేకుండా, తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఆర్‌ఓ వాటర్ ప్లాంటును నిర్మిస్తున్నారంటూ నిర్మాణంలో ఉన్న ఆర్‌ఓ వాటర్ ప్లాంటు సన్ షేడ్‌ను పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ నాగలారపు నాగార్జున, సిద్దవటం సర్పంచ్ భర్త బి. ఓబులయ్య మరో 15 మంది ధ్వంసం చేశారన్నారు. కాంట్రాక్టర్ ఫిర్యాదు మేరకు సిద్దవటం ఇన్‌చార్జి ఎస్ఐ శివప్రసాద్ కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

కోడిపందెం స్థావరంపై దాడి


మదనపల్లె : కోడిపందెం స్థావరంపై జిల్లా కేంద్ర ఎస్పీ బలగాలు, తాలూకా పోలీసులు ఆదివారం రాత్రి సంయుక్తంగా జరిపిన మెరుపు దాడుల్లో 17 మందిని అరెస్ట్ చేసినట్లు సీఐ కళా వెంకటరమణ తెలిపారు. మండలంలోని చీకలబైలు పంచాయతీ మేడిపల్లె సమీపంలో కోడిపందేలు నిర్వహిస్తున్నట్లు స్థానికులు ఎస్పీ కార్యాలయానికి ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్పీ ఆదేశాల మేరకు ప్రత్యేక బృందం మదనపల్లెకు చేరుకుని తాలూకా ఎస్ఐ హరిహరప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ సిబ్బందితో కలిసి ఆదివారం రాత్రి కోడిపందెం స్థావరంపై దాడి చేశారు. ఈ దాడిలో కోడిపందేలు ఆడుతున్న 17మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 12 కోళ్లు, 3 ద్విచక్రవాహనాలు, రూ.21,900 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదుచేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు హాజరుపరిచామన్నారు.

మద్యం తాగేందుకు వెళితే.. దొంగ అనుకుని కొట్టారు


గాయపడిన యువకుడు బాజీ

మదనపల్లె : స్నేహితులతో కలిసి మద్యం తాగేందుకు వెళ్లిన ఓ యువకుడిని, దొంగతనానికి వచ్చాడని భావించి చితకబాదిన ఘటన ఆదివారం రాత్రి మదనపల్లె మండలంలో జరిగింది. పట్టణంలోని ఈశ్వరమ్మకాలనీకి చెందిన బాజీ, ముగ్గురు స్నేహితులతో కలిసి ఆదివారం రాత్రి మద్యం తాగేందుకు కొత్తపల్లె సమీపంలోకి వెళ్లాడు. మద్యం సేవించిన తర్వాత గ్రామంలో ఓ ఇంటివద్దకు రాగా, దొంగతనానికి వచ్చారని భావించిన కుటుంబ సభ్యులు.. బాజీని బంధించి కొట్టారు. అతడి స్నేహితులు పారిపోయారు. తాలూకా ఎస్ఐ చంద్రమోహన్ ఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. మద్యం తాగేందుకు వచ్చినట్లుగా నిర్ధారించి యువకుడిని స్టేషన్‌కు తరలించారు. కౌన్సెలింగ్ అనంతరం పంపేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నాగయ్య

రామాపురం : కర్నూలు - చిత్తూరు జాతీయ రహదారిలోని రామాపురం మండలం బండపల్లి పంచాయతీ ఆటోనగర్ సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పాలగిరి నాగయ్య(71) మృతి చెందాడు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు రాయచోటి పట్టణం మాసాపేటకు చెందిన పాలగిరి నాగయ్య, గూడూరు బాషా కలిసి ఏపీ04 ఎస్ 8665 టీవీఎస్ ఎక్సెల్ వాహనంలో ఆదివారం కడపలో జరిగిన సమావేశానికి హాజరై ఇంటికి తిరిగి వస్తుండగా రాయచోటి సమీపంలోని ఆటోనగర్ వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి బోల్తా పడింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ వెంకటసుధాకర్ రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నాగయ్య పరిస్థితి విషమించడంతో కడప రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.పోలీసులు కేసు నమోదు చేశారు.

సమస్యల పరిష్కారంలో అలసత్వం తగదు

జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

రాయచోటి : ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం చేయకూడదని జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు పోలీసు యంత్రాంగాన్ని హెచ్చరించారు. అన్నమయ్య జిల్లా రాయచోటి పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్పీ అధ్యక్షతన సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించి వారితో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారి ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత డివిజన్ శాఖ పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

మానవత్వం చాటుకున్న ఎస్పీ..

మదనపల్లి పట్టణానికి చెందిన ఆవుల రామచంద్ర సమస్యలపై ఎస్పీకి ఫిర్యాదు చేసేందుకు జిల్లా పోలీసు కార్యాలయానికి వీల్‌చైర్‌లో వచ్చారు. ఎస్పీ విషయాన్ని తెలుసుకొని అతని వద్దకే స్వయంగా వెళ్లి సమస్యను సావధానంగా విన్నారు. సత్వరం విచారించి బాధితుని సమస్యను పరిష్కరించేలా చూడాలని మదనపల్లి డీఎస్పీని ఆదేశించారు. ఎస్పీ స్పందన పట్ల అక్కడికి వచ్చిన ప్రజలు అభినందనలు తెలిపారు.


వికలాంగుడి దగ్గరకు వచ్చి సమస్యను వింటున్న జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

పది టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

రాజంపేట : మన్నూరు బైపాస్ రోడ్డులో పది టన్నుల రేషన్ బియ్యం, లారీని పట్టుకున్నట్లు మన్నూరు సీఐ ఎస్ఎండీ అలీ తెలిపారు. అక్రమంగా బియ్యం తరలిస్తున్న వారిలో వెంకటగిరి పట్టణం మాసాపేటకు చెందిన కంపా అంకయ్య ప్రస్తుతం రాంనగర్‌లో నివాసం ఉంటున్నారు. అలాగే గుంతకల్‌కు చెందిన మోటు రాఘవయ్య ప్రస్తుతం భువనగిరిపల్లె ఆర్చి సమీపంలో ఉంటున్నారన్నారు. వీరిని అరెస్టు చేశామన్నారు. రేషన్ బియ్యం అక్రమ రవాణా సమాచారం రావడంతో రాజంపేట-తిరుపతి బైపాస్‌రోడ్డులో వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేశామన్నారు. పుల్లంపేట మండలం రెడ్డిపల్లె గ్రామానికి చెందిన మల్లికార్జునరెడ్డి సూచన మేరకు వీరు చౌకబియ్య అక్రమ రవాణా చేస్తున్నట్లు గుర్తించామన్నారు. లారీ, రేషన్ బియ్యాన్ని రెవెన్యూ శాఖకు అప్పగించామన్నారు.


రేషన్ బియ్యం లారీని పట్టుకున్న మన్నూరు సీఐ అలీ, పోలీసులు

విద్యుత్ స్తంభాన్ని తాడుతో నిలిపారు

ఐదు రోజులుగా స్థానికుల్లో ఆందోళన

బి.కొత్తకోట : నిత్యం పిల్లలు, వృద్ధుల సంచారం, రాకపోకలతో రద్దీగా ఉండే ఓ వీధిలో విద్యుత్ స్తంభం పడిపోతుంటే దానికి తాడు కట్టి నిలిపిన ప్రభుత్వ నిర్లక్ష్యం ఇది. ఐదు రోజులుగా ఇలాంటి పరిస్థితిలోనే విద్యుత్ సరఫరా అందిస్తున్న ఆందోళనకర పరిస్థితి అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట బలిజవీధిలో నెలకొంది. వివరాల్లోకి వెళ్తే.. దిగువబస్టాండ్ నుంచి బలిజవీధిలోకి వెళ్లే మార్గం మలుపులో విద్యుత్ స్తంభం ఉంది. రెండేళ్ల క్రితం ఈ స్తంభాన్ని ట్రాక్టర్ వెళ్తూ తగలడంతో స్తంభం అంచులో దెబ్బతింది. దీని చుట్టూ సిమెంటుతో దిమ్మెలా నిర్మించడంతో స్తంభానికి ఎలాంటి ఇబ్బంది కలగలేదు. అయితే ఈనెల 12న విద్యుత్ స్తంభం ఒరిగిపోతూ నేలపైకి పడబోతుండగా స్థానికులు గుర్తించి విద్యుత్‌శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్తంభం పడిపోకుండా బలమైన తాడును స్తంభంపైన కట్టి అదే తాడును సమీపంలోని ఓ ఇంటి కిటికీకి కట్టి ఉంచారు. దీంతో స్తంభం కొంత వాలినా అక్కడే ఆగిపోయింది. స్తంభం మార్చేందుకు తక్షణమే కొత్త విద్యుత్ స్తంభాన్ని తీసుకొచ్చి వీధిలో ఉంచారు. అయితే ఈ పనిని ఓ కాంట్రాక్టర్‌కు అప్పగించడంతో గొయ్యి తీసే వాహనం అందుబాటులో లేదని పని వాయిదా వేశారు. ఐదు రోజులుగా వీధి వాసులు ఏ క్షణంలో ఏమి జరుగుతుందో అన్న ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం విద్యుత్ సరఫరా ఉండటం, స్తంభానికి ఎదురుగా వెళ్తున్న లైను తలను తాకే ఎత్తుకు వంగిపోవడంతో ఆ వీధిలో రాకపోకలు సాగించే ప్రజలు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. ఈ విషయమై డిస్కం ఏఈ గిరిబాబును వివరణ కోరగా వీధిలోకి పెద్ద వాహనాలు వచ్చేందుకు వీలులేదన్నారు. గొయ్యి తీసి, స్తంభాన్ని నిలిపేందుకు చిన్న యంత్రాలను రప్పించి మంగళవారం ఉదయం పనులు పూర్తి చేస్తామని చెప్పారు.


స్తంభం పడిపోకుండా కట్టిన బలమైన తాడు


పైకి లేచిన స్తంభం అంచు

స్వదేశానికి మహిళ రాక

మదనపల్లె : బతుకుదెరువు కోసం కువైట్‌కు వెళ్లిన ఓ మహిళ చేసిన చిన్న తప్పునకు పోలీసులు అరెస్ట్ చేస్తే...బాధిత మహిళ భర్త వినతి మేరకు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా చొరవ చూపి మహిళను స్వదేశానికి రప్పించారు. కువైట్ నుంచి ఇండియాకు తిరిగి వచ్చిన పెద్దమండ్యం మండలం వడ్డేవంక తండాకు చెందిన పార్వతమ్మ, భర్త శంకర్ నాయక్ సోమవారం ఎమ్మెల్యే షాజహాన్‌బాషాను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా బాధిత మహిళ మాట్లాడుతూ.. కుటుంబ పోషణ కష్టమై కువైట్‌లో ఓ ఇంట్లో పాచిపనులు చేసేందుకు వెళ్లానంది. అక్కడ యజమాని వేధింపులు తాళలేక, ఇండియాకు వచ్చేద్దామనుకుంటే వారు అంగీకరించలేదన్నారు. కోపంతో వండుతున్న వంటలో ఉమ్మి వేశానని తెలిపింది. దీన్ని సీసీ కెమెరాల్లో కనిపెట్టిన యజమాని తనపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి అరెస్ట్ చేయాల్సిందిగా కోరారన్నారు. ఈ విషయాన్ని భర్త శంకర నాయక్‌కు తెలిపితే, ఆయన ఎమ్మెల్యే షాజహాన్‌బాషాను కలిసి తన పరిస్థితిని వివరించారన్నారు. తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే, మదనపల్లె టీడీపీ నాయకుడు రాటకొండ మధుబాబు కువైట్‌లో ఉన్న ఉమ్మడి నెల్లూరు జిల్లాకు చెందిన రషీదాను ఫోన్‌లో సంప్రదించి సహాయం చేయాలని కోరారన్నారు. దీంతో ఆమె తన దగ్గరకు వచ్చి, కువైట్ పోలీసులతో మాట్లాడి, కేసు లేకుండా రాజీ కుదర్చడంతో రెండు రోజుల క్రితం ఇండియాకు క్షేమంగా వచ్చానని చెప్పింది. ఇండియాకు రాలేననుకున్న తనను కువైట్ నుంచి రప్పించి, కుటుంబ సభ్యులను కలుసుకునేలా చేసినందుకు ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు కృతజ్ఞతలు తెలిపింది.


ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు కృతజ్ఞతలు తెలుపుతున్న పార్వతమ్మ, భర్త శంకర్‌నాయక్